క్లుప్తంగా

పెనమలూరు ఇన్‌చార్జ్ సీఐగా శ్రీనివాసరావు

పెనమలూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌చార్జ్ సీఐగా వాసంశెట్టి శ్రీనివాసరావును నియమించారు. ఆయన ప్రస్తుతం కంకిపాడు సీఐగా పని చేస్తున్నారు. గతంలో ఆయన పెనమలూరు క్రైమ్ ఎస్‌ఐగా పని చేశారు. ఇక్కడ సీఐగా పని చేసిన ఎం.కిషోర్‌బాబు యనమలకుదురు హత్య కేసు ఘటన కారణంగా సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో ఎవ్వరిని పెనమలూరులో సీఐగా నియమించక పోవటంతో శ్రీనివాసరావును ఇన్‌చార్జ్‌గా వేశారు. అలాగే పలు ఆరోపణలు కారణంగా పెనమలూరులో ఏఎస్‌ఐగా పని చేస్తున్న అనీల్‌ను వీఆర్‌లో ఉంచుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలోని ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరావు గురువారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు నిమత్తం ప్రసాదంపాడు ఆశ్రమం రోడ్డు, శాస్త్రి రోడ్డు, ఆంధ్రా బ్యాంక్ ఏరియా, ఎనికేపాడులో కొడాలి వారి వీధి, డీ మార్టు ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్‌లో నిర్వహించే ఆడుదాం-ఆంధ్రకు ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.ఎల్.వి.శేషగిరిరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో అక్టోబర్ రెండో తేదీన కబడ్డీ, మూడో తేదీన వాలీబాల్, నాలుగో తేదీన బ్యాడ్మింటన్ (డబుల్స్), ఐదో తేదీన ఖోఖో, ఆరు నుంచి నుంచి తొమ్మిదో తేదీ వరకు క్రికెట్ క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని వివరించారు. 17 ఏళ్లు నిండిన వారు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ క్రీడల నిర్వహణకు సచివాలయాల వారీగా ఇన్‌చార్జిలను నియమిస్తున్నామని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు మండల స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు.

భార్యపై భర్త దాడి

పెనమలూరు: భార్యపై అనుమానంతో భర్త దాడి చేసి గాయపర్చడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరులో కొత్తగా నిర్మాణం చేస్తున్న అపార్టుమెంట్‌లో మద్దాల కనకదుర్గ, ఆమె భర్త రామకోటేశ్వరరావు ఇద్దరు పిల్లలతో ఉంటున్నాడు. భర్త వాచ్‌మెన్‌గా పని చేస్తుండగా భార్య ఇళ్లల్లో పనులు చేస్తుంది. అయితే భర్త మద్యం సేవించే సమయంలో భార్యపై అనుమానంతో తరచూ గొడవపడుతూ కొట్టసాగాడు. ఈ నేపథ్యంలో బుధవారం మద్యం తాగి వచ్చిన భర్త రామకోటేశ్వరరావు భార్య కనకదుర్గపై దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో భర్తపై కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు

కంకిపాడు: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటన కంకిపాడు బైపాస్ వద్ద గురువారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం...పోరంకి, నిడమానూరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు తాపీ కార్మికులు ద్విచక్రవాహనంపై కంకిపాడు పట్టణానికి తాపీ పని నిమిత్తం వస్తుండగా కంకిపాడు బైపాస్ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు కింద పడటంతో గాయపడ్డారు. లక్ష్మి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కంకిపాడు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్, అందులో ఉన్న మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనాస్థలం పెనమలూరు పోలీసుస్టేషన్ పరిధికి చెందటంతో కేసును పెనమలూరు పోలీసులకు అప్పగించారు.

మరో ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

పెనమలూరు: పోరంకి వద్ద విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోరంకి మేరీ మాత చర్చి ప్రాంతానికి చెందిన ఎస్.రామయ్య అనే వృద్ధుడు తాపీ పని చేస్తాడు. అతను పని ముగించుకొని పెనమలూరు సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా అతనిని విజయవాడ వైపు నుంచి కంకిపాడు వైపునకు వెళ్తున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడి కాలికి గాయాలయ్యాయి. అతనిని వైద్య చికిత్సకై విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు డీవైఎఫ్‌ఐ జాతీయ సదస్సు

పెనమలూరు: విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 25వ తేదీన డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు జరుగుతుందని డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణ తెలిపారు. తాడిగడపలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిరుద్యోగుల సమస్య కేంద్ర ప్రభుత్వం పరిష్కారం చేయలేదని, యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులో డీవైఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు రహీం, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పాల్గొంటారన్నారు.

అభివృద్ధిలో నూతన ఒరబడి



రామవరప్పాడు జెడ్పీ పాఠశాలలో చురుగ్గా జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణం



అభివృద్ధి పనులు జరుగుతున్న నిడమానూరు జెడ్పీ పాఠశాల

- మనబడి నాడు - నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- 5 జెడ్పీ పాఠశాలల్లో చురుగ్గా అదనపు తరగతి గదుల నిర్మాణం
- రూ.10 కోట్లతో అభివృద్ధి, రూ.3 కోట్లతో మరమ్మతులు

రామవరప్పాడు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి విశేష ప్రాధాన్యం ఇస్తోంది. గత ప్రభుత్వంలో సర్కారు పాఠశాలలు కనీస మౌలిక వసతులకూ నోచుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ బడులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఆధునిక తరగతి గదులు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్‌లు, శుద్ధిచేసిన తాగునీరు, నిరంతర నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు వంటి వసతులు విద్యార్థులకు చేరువయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఎన్నడూ లేని విధంగా విశిష్ట సంస్కరణలు చేపట్టారు. పేద విద్యార్థులు అందరికీ నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో విద్యారంగ అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టారు. ఈ పథకాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి బాటపట్టాయి. మన బడి నాడు-నేడు కార్యక్రమం కింద కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపురేఖలు మార్చుకుంటున్నాయి.

రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు

మన బడి నాడు - నేడు కార్యక్రమం కింద విజయవాడ రూరల్ మండలంలోని 22 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.10 కోట్లతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రామవరప్పాడు, నిడమానూరు, నున్న, జక్కంపూడి పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

రామవరప్పాడులో రూ.1.8 కోట్లు, నున్నలో రూ.1.68 కోట్లు, జక్కంపూడిలో రూ.1.20 కోట్లు, నిడమానూరులో రూ.1.30 కోట్లతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. మండల పరిధిలోని 14 ఎంపీపీ, ఎంపీయూపీ పాఠశాలల్లో మరో రూ.3 కోట్లతో మరమ్మతులు జరుగుతున్నాయి. గొల్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మరమ్మతులు చేపట్టేందుకు త్వరలో రూ.42 లక్షలు విడుదల కానున్నాయి. మరో రూ.24 లక్షలతో నున్న, రాయనపాడులోని అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణం జరుగుతోంది. కె.కండ్రిక ఎంపీయూపీ పాఠశాలలో రూ.24 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టారు.

మౌలిక వసతుల కల్పన

మండలంలో పలు పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు మౌలిక వసతులను కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసించే విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఎదురవకూడదన్న ఉద్దేశంతో అన్నీ వసతులూ కల్పిస్తున్నారు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, గ్రీన్ బోర్డులు, ప్రహరీలు, ఎలక్ట్రికల్ పనులు, టైల్స్ వర్కులు, ఇనుప గ్రిల్స్, ఇతర మరమ్మతులు చేపట్టారు. గత ప్రభుత్వంలో వాచ్‌మెన్‌లు లేక ప్రభుత్వ పాఠశాలల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగేవి. ప్రస్తుత ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌లను నియమించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసింది.

ఆధునిక దేవాలయాలు



ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక దేవాలయాలుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీర్చిదిద్దారు. మన బడి నాడు-నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణాలతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి చెందడంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేదివే విద్యార్థుల సంఖ్య మూడు వేలకుపైగా పెరిగింది. అందని ద్రాక్షగా ఊరిస్తున్న ఆంగ్ల విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టి పేద విద్యార్థుల ఉన్నతికి దోహదపడ్డారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన వంటి పథకాలతో పేద విద్యార్థులకు ఎంతగానో మేలు చేకూరుస్తున్నారు.

– ఆదూరి వెంకటరత్నం, ఎంఈఓ, విజయవాడ రూరల్ మండలం

వెలుగు జిలుగులు

- ప్రధాన రహదారులకు సెంట్రల్ లైటింగ్
- రూ. 57లక్షలతో ఏర్పాటు
- కాంతులీనుతున్న కానూరు వందడుగుల రోడ్డు
- పంట కాలువ రోడ్డులో కూడా పనులు పూర్తి



సెంట్రల్ లైటింగ్‌తో వెలుగులు విరజిమ్ముతున్న కానూరు వందడుగుల రోడ్డు

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీలో రెండు రహదారులకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. కానూరు వందడుగుల రహదారి, పంట కాలువ రోడ్డుకు దాదాపు రూ. 57 లక్షలతో ఈ పనులు చేపట్టారు.

వందడుగుల రోడ్డులో సరికొత్త కాంతులు..

కానూరు వందడుగుల రోడ్డు తాడిగడప జంక్షన్ వద్ద నుంచి ఎనికేపాడు వరకు దాదాపు 4 కిలోమీటర్ల మేర ఉంది. గతంలో ఇక్కడ సెంట్రల్ లైటింగ్ ఉన్నా అవి సక్రమంగా పని చేయటం లేదు. ఈ రోడ్డులో అనేక అపార్టుమెంట్‌లు, విల్లాలు ఉన్నాయి. కానూరు ఆటోనగర్‌కు ఈ రోడ్డు ఉపయోగపడుతుంది. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి ఏలూరు వైపునకు వెళ్లే జాతీయ రహదారికి వందడుగుల రోడ్డు అనుసంధానంగా ఉంది. పలు విద్యా సంస్థలు, కల్యాణ మండపాలు ఉన్నాయి. ఈ రోడ్డులో వాకర్స్ ఉదయాన్నే వాకింగ్ కూడా చేస్తారు. ఇవన్ని దృష్టిలో ఉంచుకుని తాడిగడప మునిసిపాలిటీ రూ. 20 లక్షలు వెచ్చించి సెంట్రల్ లైటింగ్‌ను ఆధునికీకరించింది. అదే విధంగా అన్ని విద్యుత్ స్తంభాలకు రంగురంగుల రోప్ లైటింగ్ ఏర్పాటు చేసింది.

పంటకాలువకు రోడ్డుకు కూడా..

కాగా చాలా కాలంగా మోక్షం లేకుండా ఉన్న పంటకాలువ రోడ్డుకు కూడా సెంట్రల్ లైటింగ్ త్వరలో ప్రారంభించనున్నారు. టీడీపీ పాలనలో సీఆర్‌డీఏ పంటకాలువ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేసింది. దీంతో తాడిగడప మునిసిపాలిటీ రూ. 37 లక్షలు ఖర్చు చేసి దాదాపు 2 కిలోమీటర్ల మేర విద్యుత్ కేబుల్, స్తంభాలు, రోప్ లైటింగ్ ఏర్పాటు చేసింది. ఈ పనులన్నీ పూర్తయ్యాయి. త్వరలో దీనిని ఈ లైటింగ్‌ను కూడా ప్రారంభించనున్నారు.

ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకుని..



ప్రజల అవసరలు దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ లైటింగ్ పనులు చేశాం. రాత్రి సమయాల్లో ప్రజలు భద్రతతో ప్రయాణం చేయటానికి చర్యలు తీసుకున్నాం. పంటకాలువ రోడ్డులో కూడా సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయ్యాయి. త్వరలో ప్రారంభిస్తాం

– ఎన్.ప్రకాశరావు, కమిషనర్, తాడిగడప మునిసిపాలిటీ

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సివిల్ సప్లయీస్ కమిషనర్ అరుణ్‌కుమార్



పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

కంకిపాడు(పెనమలూరు): చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర సివిల్ సప్లయీస్ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ అన్నారు. వినియోగదారుల చట్టం, వినియోగదారుల క్లబ్‌ల ఏర్పాటు, విధి విధానాలపై పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సివిల్ సప్లయీస్ కమిషనర్ అరుణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంరక్షణకు ప్రభుత్వం వినియోగదారుల సంరక్షణ చట్టాన్ని తెచ్చిందన్నారు. చట్టంలో కల్పించిన హక్కులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వస్తువుల కొనుగోళ్ల విషయంలో జరుగుతున్న మోసాలను అరికట్టేందుకు సమగ్ర అవగాహన ఉంటేనే సాధ్యమన్నారు. వస్తువుల కొనుగోళ్లు, నాణ్యత, తూకాల్లో మోసాలను పసిగట్టి మోసాల బారి నుంచి బయటపడాలన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండి తల్లిదండ్రులకు తెలియజెప్పాలని సూచించారు. చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ పార్వతి, ఎంఈఓ ప్రసాద్, హెచ్‌ఎం ఆలపాటి వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయిస్ డీటీ ఎస్.భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తగా 146 పింఛన్ల మంజూరు



ఉంగుటూరు: మండలంలో 16 గ్రామ సచివాలయల పరిధిలో 146 మంది కొత్తగా పింఛన్లు పొందేందుకు అర్హత కలిగి ఉన్నారని ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. పలు గ్రామాల్లో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్జీలను అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జనవరి నుంచి వైఎస్సార్ పింఛన్ కోసం అందిన దరఖాస్తులను ర్యాండమ్‌గా పరిశీలించారు.

పెనమలూరు పంచాయతీ గుమాస్తా సస్పెన్షన్

పెనమలూరు: స్థానిక గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎం.వాసుదేవరావును అవినీతి ఆరోపణలపై సస్పెన్షన్ చేశారు. మేరకు జిల్లాపంచాయతీ అధికారి ఎస్‌వీ నాగేశ్వర్‌నాయక్ సస్పెన్షన్ ఉత్తర్వులు గురువారం జారీ చేశారు. పెనమలూరు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగాయన్న ఆరోపణలపై అధికారులు విచారణ చేశారు. అధికారుల విచారణలో గ్రామ పంచాయతీ నిధులు రూ. 92,67,004 లక్షలు స్వాహా అయ్యాయని అధికారులు గుర్తించారు. దీంతో పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, పూర్వ కార్యదర్శి ప్రసాద్‌ను సస్పెన్షన్ చేశారు. ఇప్పుడు గుమాస్తా వాసుదేవరావును సస్పెండ్ చేశారు. నిధుల దుర్వినియోగంలో బిల్లు కలెక్టర్ షేక్ షంషుద్దీన్‌ను కూడా గతంలో సస్పెన్షన్ చేసి క్రిమినల్ కేసు పెట్టగా అతను పరారీలో ఉన్నాడు.

రూ.5 లక్షలతో డ్రెయిన్, కల్వర్టు నిర్మాణం

నున్న(విజయవాడరూరల్): నున్న పరిధిలోని బోడపాడు గ్రామంలో రూ.5 లక్షల పంచాయతీ సాధరణ నిధులతో డ్రెయిన్ కమ్ కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీజీటీఎం పార్కు దక్షిణం వైపు ఎస్సీ ఏరియాలో 60 మీటర్ల పొడవున డ్రెయిన్, రెండు చోట్ల కల్వర్టులు నిర్మిస్తున్నామని సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ తెలిపారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు కల్వర్టులు నిర్మిస్తున్నామని సర్పంచ్ పేర్కొన్నారు.

ముస్తాబాదలో చంద్రయాన్ విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీలో ప్రిన్సిపాల్, విద్యార్థులు

ముస్తాబాద(గన్నవరం): చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ మండలంలోని ముస్తాబాదలో నవభారత్ హైస్కూల్ విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలను చేబూని వీధుల్లో ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ షేక్ ఇమామ్ మాట్లాడుతూ.. చంద్రయాన్-3 ప్రయోగం ద్వారా జాబిల్లిపై అడుగుపెట్టిన నాల్గో దేశంగా భారత్ నిలిచిందన్నారు. చంద్రుడిపై అతి క్లిష్టమైన దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొదటి దేశంగా భారత్ రికార్డు సృష్టించిందన్నారు. ఇంతటి ఘనవిజయానికి కారుకులైన ఇస్రో శాస్త్రవేత్తలను ప్రతి ఒక్కరూ అభినందించాలని కోరారు. ర్యాలీలో నేచురోపతి వైద్యుడు డాక్టర్ శ్రీధర్‌బాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ నానారావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయం



విద్యుత్ దీపాల వెలుగుల్లో కాంతులీనుతున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయం

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయం శ్రావణ మాసం రెండో శుక్రవారం నిర్వహించే ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం తెల్లవారుజామున అఖండ దీపారాధనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ గురువారం తెలిపారు. అనంతరం మాను(మహాలక్ష్మి)కు పూజలు, అమ్మవారికి గ్రామపొంగళ్లు సమర్పించనున్నట్లు చెప్పారు. సాయంత్రం ప్రభ బండ్ల ఊరేగింపుగా భక్తులు ఆలయానికి తరలివస్తారని తెలిపారు. రాత్రి శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకి వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం



చంద్రశేఖర్ కుటుంబానికి పరిహారం ఉత్తర్వులు అందిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయభాస్కర్

కంకిపాడు: ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయభాస్కర్ అన్నారు. మండలంలోని ఉప్పులూరు గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ఈడుపుగంటి చంద్రశేఖర్ విధులు నిర్వర్తిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతిచెందటంతో ప్రభుత్వం నుంచి రూ. 5 లక్షలు పరిహారం చంద్రశేఖర్ కుటుంబ సభ్యుల ఖాతాకు జమయ్యాయి. ఈ మేరకు ఉత్తర్వుల ప్రతిని చంద్రశేఖర్ సతీమణి కుమారి, ఇతర కుటుంబ సభ్యులకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. ఉదయభాస్కర్ మాట్లాడుతూ చంద్రశేఖర్ కుమార్తె రమ్యారాణికి ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని కల్పించారన్నారు. పరిహారం సొమ్మును కుటుంబ ఉన్నతికి వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లాం పార్వతి, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, వైఎస్సార్‌సీపీ నేతలు లాం సురేష్, లాం ఏసుపాదం, ఏపీఓ బసవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్‌పై పటమట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



పటమట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నూరుద్దీన్ తదితరులు

రామవరప్పాడు: గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ నాయకుడు నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కొడాలి నాని, వల్లభనేని వంశీమోహన్, మంత్రి రోజాపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై పటమట పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. ముస్లిం రైట్స్ వెల్ఫేర్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ నూరుద్దీన్ గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నూరుద్దీన్ మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా టీడీపీ నాయకులు లోకేశ్, అయ్యన్నపాత్రుడు, యార్లగడ్డ వెంకట్రావు వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. మహిళా మంత్రి రోజాను అయ్యన్న పాత్రుడు కించపరచడం శోచనీయమన్నారు. డీజీపీ స్పందించి టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సంస్థ జాయింట్ సెక్రటరీ మహ్మమద్ ఇంతియాజ్, షేక్ మస్తాన్, మహమ్మద్ ఇస్మాయిల్, వలీ, ఇబ్రహీం పాల్గొన్నారు.

వేగంగా మౌలిక వసతుల కల్పన



సిమెంటు రోడ్డు అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తున్న జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి

కంకిపాడు: కంకిపాడు పట్టణంలో మౌలిక వసతుల కల్పన శరవేగంగా జరుగుతోందని జేసీఎస్ చైర్మన్, కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి అన్నారు. పట్టణంలోని 2, 16 వార్డుల్లో రూ. 5లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన మూడు సిమెంటు రోడ్ల అభివృద్ధి పనులను గురువారం ప్రారంభించారు. పనులను చిరంజీవి, పాలకవర్గ ప్రతినిధులు పరిశీలించారు. చిరంజీవి మాట్లాడుతూ గ్రామంలో ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చిట్టూరి కోటయ్యబాబు, కె.జానకి, ఏఎంసీ డైరెక్టర్ తాళ్లూరి మరియబాబు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలైన వైద్యసేవలు అందించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు మేలైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆదేశించారు. నున్న గ్రామ సచివాలయ-3 పరిధిలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో డీఎంహెచ్‌ఓ సుహాసిని గురువారం తనిఖీ చేశారు. ఇక్కడ అందుతున్న వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణి కె.స్వాతికి చేసిన వైద్య పరీక్షలు, అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించిన పిమ్మట సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేశారు. పది మంది పిల్లలకు ఎనిమిది మందే హాజరుకావడంపై అంగన్‌వాడీ టీచర్‌ను ప్రశ్నించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పంపిణీచేసే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

అభయాంజనేయుడి సన్నిధిలో అన్నదానానికి రూ.50 వేల విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి గురువారం రూ.50 వేల విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, కార్యనిర్వాహణాధికారి కూచిపూడి శ్రీనివాస్, అర్చకుడు శృంగారం రామానుజాచార్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధి, సేవా కార్యక్రమాల నిమిత్తం భవిష్యత్‌లోనూ తనవంతు విరాళాలను అందిస్తామనని సీతారామాంజనేయ చౌదరి తెలిపారు.

స్కిల్‌హబ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్ సెంటర్‌లో నిరుద్యోగ యువతీ యువకులకు వెబ్ డెవలపర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ విద్యార్హతతో నాన్ రెసిడెన్షియల్ శిక్షణ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై ట్రెనింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ జారీ చేయడంతో పాటు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని వివరించారు. నియోజకవర్గంలోని 18 నుంచి 27 ఏళ్లలోపు యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేషనల్ రైఫిల్ షూటింగ్ పోటీలకు జంక్షన్ విద్యార్థి



రైఫిల్ షూటర్ చింతా రేవంత్ సాయి సందేశ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు హనుమాన్‌జంక్షన్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి చింతా రేవంత్ సాయి సందేష్ ఎంపికయ్యాడు. ఇటీవల కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో జరిగిన 14వ సౌత్ జోన్ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రేవంత్ సాయి సందేష్ సత్తాచాటాడు. పది మీటర్ల యూత్ మెన్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి సౌత్‌జోన్‌లో 20వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. ఏపీ నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న షూటర్లలో మొదటి స్థానం దక్కించుకున్నాడు. దీంతో త్వరలో ఢిల్లీలో జరగబోయే నేషనల్ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌నకు రాష్ట్రం తరపున ఎంపికయ్యాడు. రేవంత్ సాయి సందేష్, అతని తండ్రి లక్ష్మీరాఘవన్‌ను పలువురు అభినందించారు.